

# అంతం కానిది ...

మా ఆయన టైము కాప్స్యూల్ షెల్ తయారై రాగానే గెస్ట్‌హౌస్‌లో పెట్టించాను. చూడబోతే అది పెద్ద ఇనుప పెట్టెలా ఉంది. మూత వేసేసి టైటుగా సోల్డర్ చేస్తే చాలు. గాలి కూడా చొరబారనంత దృఢంగా ఉంది. చూడటానికి ఏమాత్రం అందంగా లేదు. అదే అన్నాను ఆయనతో.

"పైకి అందంగా కనబడడం కాదు దీని లక్ష్యం. ఇరవయ్యవ శతాబ్దం కొన్ని రోజుల్లో అయిపోతోంది కదా! ఈనాటి సమాజం గురించి ముందు తరాల వాళ్లు తెలుసుకునేటందుకు వీలుగా తయారుచేసి నేలలో పాతిపెడతాం. ఈనాటి విశేషాలన్నీ రాసి, మైక్రో ఫిల్ముల్లో తీసి లేబుల్స్ రాసి ఈ కాప్స్యూల్స్‌లో పెడతాం ..." అన్నారాయన.

"ఎందుకు? పత్రికల్లో రాస్తారుగా. అవి చదువుకుంటారులెండి!"

"పత్రికలూ అవీ ఎన్నాళ్లు ఉంటాయంటావు? ప్రళయానికి తట్టుకోగలవా? అన్నీ నాశనం అయిపోతాయి. ఎటువంటి ఆటుపోటులకైనా తట్టుకునేట్లు రకరకాల మెటల్స్‌తో తయారుచేయించారు దీన్ని. అన్నీ నాశనమైనా ఇది మాత్రం మిగులుతుంది. ప్రళయం తర్వాత కొన్ని శతాబ్దాలకైనా సరే మానవజాతి మళ్లీ ఉద్భవిస్తే ఇవన్నీ చూసి, చదువుకుని ఈనాటి చరిత్ర తెలుసుకుంటారు."

"అంటే ఈ ఏడాది చివరికి ప్రళయం రాక తప్పదంటారా?"

"వస్తుందనే అందరూ అంటున్నారుగా. రానూవచ్చు, రాకపోనూవచ్చు. ఈ ఏడాది కాకపోతే పై ఏడాది రావచ్చు. ఈ జగత్తుకి అంతం అంటూ ఉంటుందిగా. కలియుగం అంతం కాబోతోందని బ్రహ్మంగారి నుంచి నోస్ట్రాడమస్ దాకా ప్రతివాళ్లూ చెప్పారట. మనం సిద్ధంగా ఉండటం మంచిది కదా!"

"ఆ మధ్య ప్రభుత్వం వాళ్లు కూడా ఏదో టైము కాప్స్యూల్ తయారుచేసి పాతిపెట్టారేమో ..."

"కరెక్ట్. కానీ దానికీ, దీనికీ తేడా ఉంది. ఇది ప్రైవేటు పార్టీ. ఒక ఇండస్ట్రియలిస్టు తన స్వంత ఖర్చుతో చేస్తున్నది. అతని భావాలకు అనుగుణంగా."

"మీకు మంచి పనే దొరికిందిలెండి. వాళ్లకు మీరెలా దొరికారో ...?"

"నా గురించి వాకబు చేశారట. వాళ్లు అనుకున్నదాన్ని ఆచరణలో పెట్టగలిగేవాణ్ణి నేనేనని చెప్పారుట!"

"చెప్పే ఉంటారులెండి. పెళ్లాన్ని పట్టించుకోకుండా అహోరాత్రాలు ఇలాంటి పన్లు పెట్టుకుని ఊరేగుతారని ఊళ్లో అందరికీ తెలుసుగా!" అంటూ మూతి విరిచి వచ్చేశాను.

**తరువాయి 6వ పేజీలో....**

...4వ పేజీ తరువాయి

మా ఆయన గురించి నాకంటే ఎవరికి బాగా తెలుస్తుంది? కానీ అది ఊళ్లో వాళ్లకె అర్థం కాదు. "ఇదిగో తారా! మీ ఆయన ఎంత గొప్పవాడో తెలుసా?" అంటారు పార్టీల్లో, ఫంక్షన్లల్లో. ప్రొఫెసర్ గురునాథ్ ఎమ్.ఏ., పిహెచ్.డి., ఎఫ్.ఆర్.... ఏదో నా తలకాయ! ఇంగ్లీషు భాషలో సగం అక్షరాలు పడతాయి మా ఆయన డిగ్రీలు రాయడానికి. ఆయన నాకంటే పదిహేను ఏళ్లు పెద్దవాడన్న కారణంగా చిన్నచూపు చూస్తున్నాననుకోవద్దు. సినిమాల్లో ప్రొఫెసర్లలా కాదు కదా, మతిమరుపు సైంటిస్టులా కూడా ఉండడు మా ఆయన. అదో రకం మనిషి. ఎందుకూ పనికిమాలిన రకం. ఏ నథింగ్, ఏ బిగ్ నథింగ్.

పెళ్లికి ముందే గ్రహించాను ఆయన సంగతి. కానీ ఆయన పేర మా అత్తగారిచ్చిన పెద్ద బంగళా చూస్తే వదలబుద్ధి కాలేదు. పాతకాలందే కానీ, కొన్ని మార్పులు చేస్తే బ్రహ్మాండంగా తయారవుతుం దనిపించింది. అలాగే ఈయన్ని కూడా బూజు దులిపితే బాగుపడతా డనిపించింది. పెళ్లయ్యాక ఒక ఇంటీరియర్ డెకొరేటర్ సహాయంతో ఇంటిని మార్చగలిగాను. కానీ, ఇంటాయన్ని మాత్రం మార్చలేకపోయాను.

తర్వాత ఆ ఇల్లు చూసి మురవడమే తప్ప, జాలీగా ఖర్చు పెట్టుకోడానికి చేతిలో డబ్బు లేక ఏడవాల్సి వచ్చింది. ఏదైనా సరదాగా ఖర్చుపెడదామంటే 'వేస్టు' అంటాడీయన. ఆయనకో సిగరెట్టు అలవాటు లేదు, తాగుడు గిట్టదు. ఓ సినిమా, ఓ సీరియల్, ఓ నాటకం ఏదీ నచ్చదు. టీవీ కూడా చూడని మనిషి గురించి ఏం చెప్పాలి? ఆయనతో లైఫే పెద్ద బోరు. మోడ్రన్ అన్న ఏదీ నచ్చనివాడితో ఎలా వేగగలం?

అందుకే టైము కాప్స్యూల్ వచ్చాక ఆయన నా దగ్గరికి వచ్చి, "ఎమ్ టీవీలో కొన్ని పాటలు రికార్డు చేసి ఇస్తావా?" అని అడిగితే తెల్లబోయాను.

"మీరు ....? ఎమ్ టీ.వీ....? నా మెదడుకి ఏమీ కాలేదు కదా?" అన్నాను.

"నీకేం కాలేదు. చెప్పేది విను. ఈ ప్రాజెక్టు లక్షణం ఏమిటో ముందు తెలుసుకో. అప్పుడు నీకు అర్థమవుతుంది. సాధారణంగా టైము కాప్స్యూల్‌లో జాతి ఎలా ఉంటే బాగుంటుంది అనుకుంటారో అలాంటివే పెడతారు. కానీ దీని లక్ష్యం అది కాదు. ఎలా ఉండాలో అని కాకుండా, నిజంగా ఎలా ఉందో అది ప్రతిబింబించేట్లా రూపొందిస్తున్నాం. అదీ సంగతి!"

"అంటే...?"

"ఉదాహరణకి మన తెలుగు సినిమాల గురించి కొన్ని నమూనాలు పెట్టాలనుకో. ప్రభుత్వం వాళ్లయితే ఏ శంకరాభరణమో పెడతారు. భావి తరాలవాళ్లకు అది చూపిస్తే గ్రాండ్‌గా ఉంటుంది కదాని. కానీ మా ఐడియా అది కాదు. అందరూ మెచ్చిన సినిమా పెట్టాలి. ఆ ఖైదీ సినిమాలాంటిది అన్న మాట. దానిలో ఆ పాముల పాట లేదూ- రగులుతోంది, పొగులుతోంది అంటూ ... అదీ పెడతాం!" అన్నాడయన.

నాకు నవ్వు ఆగలేదు. "ప్రొఫెసర్ గురునాథ్ గారికి రగులుతోంది పాటలు కూడా తెలుసా? వారికి ఇవన్నీ తెలుస్తాయని నేనెన్నడూ అనుకోలేదే!" అన్నాను వెక్కిరిస్తూ.

ఆయనా చిరునవ్వు నవ్వారు. "ఇన్నాళ్లూ తెలియదు. ఇప్పుడే తెలుసుకుంటున్నాను. అన్ని రకాలు చూస్తున్నాను. అప్పుడే తెలుస్తుంది, ఏది ప్రజాదరణ పొందింది, ఏది లేదు అని. ఈ శతాబ్దం అంతం అయ్యేది కొన్ని నెలల్లోనే. సినిమాలే కాదు, పుస్తకాలు, టీవీలు, పోర్నోగ్రఫీ పుస్తకాలు సంపాదించి పెట్టబోతున్నాను. ఎమ్‌టీవీ, వీటీవీలాంటి వాటిల్లోంచి మంచి క్లిప్పింగ్స్ చూసి పెట్టాలి. మంచి అంటే నిజంగా మంచి అని, కళాత్మకత ఉన్నవి అని కాదు, ప్రజలందరూ సెభాష్ అన్నది మనకి కావాలి!"

"ఇవన్నీ మీరు ఎప్పుడు చూస్తారు? అసలు మీకు తలా, తోకా ఏదీ తెలియదు కదా! చూడడం, పోల్చడం, నిర్ణయించడం, సేకరించడం ఇవన్నీ ఇంత తక్కువ కాలంలో అయ్యే పనులేనా?"

"అందుకే నీ సహాయం కోరుతున్నాను. నీకు నచ్చినవన్నీ దీంట్లో పడేస్తూ ఉండు. నేను చివర్లో సీలు చేస్తాను. మనింటినుండే పాతిపెట్టే స్థలానికి

**ఎమ్బీయస్ ప్రసాద్**

వెళ్తుంది."

"అంటే నా టేస్టు బాగుండదనా?" బుంగమూతి పెట్టి అడిగాను.

"ఛ..! ఛ...! నీది మెజారిటీ అభిప్రాయం అని నా ఉద్దేశ్యం. సంఘంలో చాలామంది ప్రజలు ఎలా ఆలోచిస్తారో అలాగే నువ్వూ ఆలోచిస్తావు. అందుచేత నీ సెలక్షనే కావాలి. నీకు నచ్చిన బట్టలు, లోదుస్తులు, నగలు, పుస్తకాలు, నీ చుట్టూ ఉన్నవాళ్ల చరిత్రలు ..."

"చుట్టుపట్ల నివసించే వాళ్ల చరిత్రలంటే మంచి చెడూ, చాపల్యం, ఆశబోతుతనం, అసూయ .... అన్నీనా?"

"ఆహా, అన్నీ కావాలి! 'ప్రజలందరూ సుఖశాంతులతో కడుపులో చల్ల కదలకుండా జీవించిరి' అని అబద్ధాలు నాకు రాయడం ఇష్టం లేదు. ఫలానా కారణాల వల్ల ఇంత శాతం మంది భార్యాభర్తలు విడిపోతున్నారు. మూడో వ్యక్తి ప్రమేయం కలుగుతోంది అని రాసేయ్యాలి. గుర్తుంచుకోవలసినది ఏమిటంటే నిజాలే రాయాలి. అతిశయోక్తులు వద్దు!"

"అంటే అక్రమ సంబంధాల గురించి కూడా రాయమంటారు ..."

"నిక్షేపంలా రాయి. నిజానికీ విషయ సేకరణలో నీ సాయం ఎంతో అవసరం పడుతుంది."

అక్రమ సంబంధాల గురించి అంత స్పెసిఫిక్‌గా అడగడానికి కారణం ఉంది. నా మనస్సులోని అపరాధభావనే అన్నిసార్లు అడిగించిందేమో! శశికాంత్‌తో పరిచయం కాకుండా ఉంటే మరీ ఇంత అపరాధ భావన ఉండేది కాదేమో! అలా అని శశికాంత్‌కు ముందు నాకెవరూ తెలియదని కాదు. మా పాత ఇల్లు మార్పులు చేయించడానికి పిలిచిన ఇంటీరియర్ డెకొరేటర్ కూడా నా మనసు దోచుకున్నాడు. మనసొకటే కాదులెండి. అందమైన మరాఠీ కుర్రాడు. బెడ్‌రూమ్ ఎలా ఉండాలో అతను విశ్లేషించినదాన్నిబట్టే అతని టేస్టు గ్రహించాను. అందుకే చేరదీశాను. అతను బాగా రెస్పాండ్ అయ్యాడు.

కానీ శశికాంత్ రంగంలోకి వచ్చేసరికి మరాఠీ కుర్రాడు వెలవెలబోయాడు. మా ఆస్తి వ్యవహారాలు చూడటానికి మావారు నియమించిన కొత్త లాయరు శశికాంత్. మొదటి చూపులోనే నన్ను స్టడీ చేసేశాడు. అతని చొరవకు హేట్స్ ఆఫ్! నేనలాంటి దాన్ని కాదని ఎంత చెప్పినా, "వాల్లే జోకులు!" అంటూ దగ్గరకు లాక్కునేవాడు. అంతే! నా ఒళ్లు వశం తప్పేది. అక్కడ మా వారు యూనివర్సిటీలో పాఠాలు చెబుతూ ఉంటే, ఇక్కడ లాయరుగారు నాకు చెప్పేవాడు పాఠాలు - ప్రేమపాఠాలు. ఒక్కొక్కప్పుడు నా దగ్గరే నేర్చుకునేవాడు కూడాను. నేను మాత్రం తక్కువ తిన్నానా? అతనికంటే కొత్త కొత్త ఐడియాలు వచ్చేవి. జీవితాన్ని ఇద్దరం కలిసి జుర్రుకున్నాం.

వ్యవహారం అలా సాగితే బాగానే ఉండునేమో! కానీ శశికాంత్ అంతటితో ఆగే మనిషి కాదు. ఇద్దరం కలిసి లేచిపోదామంటాడు. నాకు కష్టం తోచింది. ఇంత ఆస్తి వదులుకుని పోవడమా?

శశికాంత్ నవ్వేశాడు. "ఆస్తి నాకు మాత్రం చేదా? లాయర్ని కాబట్టి యావదాస్తినీ నీ పేర క్రమంగా ట్రాన్స్‌ఫర్ చేయించేశాను. నీ పిచ్చి మొగుడు నేను చెప్పినచోటల్లా సంతకం పెట్టేశాడు. మనం ఎప్పుడు పారిపోవాలో నేను ముహూర్తం పెడతాను. ఆలోగా ఇంట్లో ఉన్నవన్నీ నగా, నట్రాగా మార్చేసి, తీసుకుపోవడానికి వీలుగా పెట్టెలో సర్దేసెయ్. చల్ మోహనరంగా అని ఉడాయించేద్దాం. గురునాథ్‌కి జీతం డబ్బులు చాలు. ఖర్చా, ఏమన్నానా? మనకైతే బోల్డు ఖర్చులుంటాయి కాబట్టి డబ్బు అవసరం!" అన్నాడు.

నిజమే! నాకు, శశికాంత్‌కి ఎంత డబ్బూ చాలదు. క్లబ్బులకు, షికార్లకు హాయిగా తిరుగుతాం. అతనితో పరిచయమయ్యాకనే తెలిసివచ్చింది జీవితాన్ని ఎందరు ఎన్ని రకాలుగా అనుభవిస్తున్నారో! మా ఆయన కాన్ఫరెన్సులకని వేరే ఊళ్లు వెళ్లినప్పుడు ఇతను క్లబ్బుల్లో తిప్పేవాడు. అక్కడ చూశాను

సమాజం యొక్క నిజస్వరూపం. పైకి పెద్దమనుషుల్లా కనబడేవాళ్లందరూ పక్కవాడి పెళ్లాలతో కులికేవాళ్లే. ఒక్కదానికీ శీలం గురించి చింత లేదు. ఎవడు నచ్చితే వాడితో పోవడమే. పైకి మాత్రం పతివ్రత వేషాలు. భారత స్త్రీ, వంకాయపులుసు అంటూ కబుర్లు. వారం తిరక్కుండా ప్రియుణ్ణి మార్చేయడం. వాళ్లతో పోలిస్తే నేనే చాలా బెటరు. సమకాలీన సమాజం ఇలా ఉంటే, పుస్తకాలలో మాత్రం ఇండియాలో భార్యాభర్తల మధ్య అనురాగం ఎక్కువ, కుటుంబ భావన ఎక్కువ, విడాకుల రేటు తక్కువ అంటూ చెత్త రాస్తారు. విడాకులెందుకు? రంకు సాగుతుంటే! మన ప్రొఫెసరు గారికి ఇవన్నీ తెలుసో, తెలియదో? అన్నట్టు టైము కాప్స్యూల్‌లో నా చరిత్రే రాసిపెడితే? అదెప్పుడో శతాబ్దాల తర్వాత తెరుస్తారు. అప్పుడు ఫలానా తార అనే ఆమె, మొగుడు చవట కావడంచేత, మిండగాళ్లని మరిగింది, అని తెలిస్తే నష్టం ఏమిటి?

సరదా కొద్దీ నా కథ, నేను కలిసిన, చూసిన మనుషుల అంతరంగిక ప్రవర్తన, ఆలోచనా విధానం, లైంగిక జీవన సరళి అంతా రాద్దామనుకున్నాను కానీ, రాయడం చాలా రోజులే పట్టింది. మా వారు టైము కాప్స్యూల్‌లో చేరవేయవలసిన సమాచారం సేకరించే పని నాకే అప్పగించారని చెప్పాను కదా. తలమునకలయ్యేటంత పని. కానీ నాకు హుషారుగానే ఉంది. కొన్ని సబ్జెక్టులు నాకే వదిలేశారు. ఎక్కడెక్కడో బూతుబొమ్మలు సంపాదించి ఆయన పట్టుకురావడం, 'చూడు, ఇది నీకు నచ్చిందా?' అనడం, సరేనంటే లోపల పెట్టడం. 'నా ఇష్టాయిష్టాలతో ప్రమేయం ఏముంది?' అంటే, 'చెప్పానుగా, నీది మెజారిటీ ప్రజల అభిప్రాయం. నాబోటివాడిది వేరే లోకం. నా అభిరుచి ఈనాటి సమాజాన్ని ప్రతిబింబించదు' అన్నారు. వాటినన్నిటినీ చిన్న చిన్న పెట్టెల్లో పెట్టి సీలు చేయడం, కాప్స్యూల్‌లో పడేయడం. అలా పడేసేవాటిల్లోనే ఆయన చూడకుండా నా కథ కూడా ఓ పెట్టెలో పెట్టి సీలు చేసేశాను.

ఈలోగా శశికాంత్ కూడా తన ఏర్పాట్లు చేసుకుంటున్నాడు. చెప్పద్దూ, ఈ కాప్స్యూల్ ధర్మమాని మావారితో కాస్త మాట్లాడటం, సాన్నిహిత్యం పెరిగింది. మనస్సు అటూ, ఇటూ ఊగలాడసాగింది. అందుకనే 'త్వరగా వెళ్లిపోదాం, శశీ!' అన్నాను. "ఇప్పుడు గురునాథ్‌ని హేపీగా ఉంచడమే మనకి కావలసినది. లేకపోతే ఎలర్ట్ అయిపోతాడు. నేను నా పనులన్నీ కూడా ఒక కొలిక్కి తీసుకురావాలి కదా!" అని నచ్చచెప్పాడు.

చివరికి సెప్టెంబరు 15 రాత్రికి ముహూర్తం పెట్టాడు. "సెప్టెంబరు 16నే టైము కాప్స్యూల్‌ని పాతిపెట్టే ఫంక్షన్. ఆ ముందురోజు రాత్రి మీ ఇంటి దగ్గరనుంచి దాన్ని పాతిపెట్టే స్థలానికి తీసుకెళ్తారు. మీ ఆయన ఆ హడావుడితో ఉంటాడు. మనం పారిపోయిన విషయం అతను గ్రహించేటప్పటికే 24 గంటలు దాటిపోతుంది. మనం ఈలోగా బొంబాయి వెళ్లడం, అక్కడ్నుంచి బాంగ్‌కాక్ ఫ్లైట్ ఎక్కడం కూడా జరిగిపోతుంది!" అన్నాడు.

శశికాంత్‌ది గట్టి బుర్ర. అతను ఊహించినట్లే సెప్టెంబరు 15న పొద్దుటినుంచి మా వారు గెస్ట్‌హౌస్‌లోనే ఉండి కాప్స్యూల్‌కి ఫినిషింగ్ టచెస్ ఇస్తున్నారు. నేను బట్టలూ, నగలూ అన్నీ సర్దుకోవడం అయిపోయింది. అన్నీ ఏర్పాటు చేసుకుని కూర్చున్నదాకా ఉండి చీకటిపడుతుంటే నాకు అదోలా అనిపించింది. నెర్వస్‌నెస్ కాదు. ఈమధ్య ఈ కాప్స్యూల్ పనితో మా ఇద్దరి మధ్య ఒకవిధమైన బంధం ఏర్పడినట్లనిపించింది. ఇప్పుడు ఇలా వెళ్లిపోవడం సబబేనా అనిపించింది. అదే విషయం ఫోన్ చేసి చెప్పాను. అతను కంగారు పడ్డట్టున్నాడు కాబోలు. నన్ను ఎలా ఆకట్టుకోవాలో బాగా తెలుసు. ఫోన్ చేసిన అరగంటలో తయారై వచ్చాడు, నా కిష్టమైన సెంటు పూసుకుని.

"ఇప్పుడా? అవతల గెస్ట్‌హౌస్‌లో మా ఆయన ..." అన్నాను అతని కౌగిల్లో ఒదిగిపోతూనే.

"వాడి మొహం! వాడికెంతసేపూ ఆ ఇనుపభరిణ రంధి. నాకేమో ఈ అందాల భరిణ..." అంటూ పెనవేసుకున్నాడు. పావుగంట తర్వాత నా సందేహాలన్నీ పటాపంచలైపోయాయి. ఈ అందగాడి పొందుకోసం వందమంది గురునాథాలను మోసగించినా ఫర్వాలేదనిపించింది. కాప్స్యూల్ తీసుకెళ్లే ట్రక్ వస్తున్న శబ్దం కావడంతో శశి లేచి గబగబా వెనక దారి వెంబడి జారుకున్నాడు. నేను బట్టలు సవరించుకుని గెస్ట్ హౌస్‌కెళ్లాను. ఆయన వెల్డింగ్ మెషిన్ చేత్తో పట్టుకుని దాని డోర్లన్నీ అతికిస్తున్నారు.

"మీ కాప్స్యూల్ రెడీ కాలేదా? ట్రక్ వచ్చేసినట్టుంది!" అన్నాను.

"అయిపోయినట్టే. ఆఖరు నిమిషంలో గుర్తొచ్చింది. ఒకటి రెండు స్పెసిమెన్స్ కూడా పెడితే బాగుండునని. ఇక ఈ డోరు ఒక్కటీ మిగిలింది!" అన్నారాయన తల తిప్పకుండానే.

"ఇంత కష్టపడుతున్నారు ... ఇప్పట్లో ఈ లోకం అంతం అవుతుందో లేదో?" అన్నాను విలాసంగా నవ్వుతూ.

"లోకం మాట అటుంచు. అంతం కానిది ఏమిటో తెలుసా? మానవుడి ఆశ, కోరిక, కామం. అది నిరూపించడానికే కొన్ని స్పెసిమెన్స్ కూడా పెడుతున్నాను. లేబుల్స్ కూడా రెడీ అయిపోయాయి!" అంటూ ఆయన వంగి ఒక శవం మీద లేబుల్ అంటించారు. ఆ శవం వేరెవరిదో కాదు, శశికాంత్‌ది! గుండెల్లో పిడిదాకా దిగేసిన కత్తి!

నేను గజగజా వణికాను. మాటలు పెగల్లేదు.

"అయితే ... మీకు ... అంతా ..."

ఆయన చిరునవ్వు నవ్వారు. "తెలుసు. మీ ఇద్దరి మధ్య సాగుతున్నది ఈ మధ్యే గ్రహించాను. శశికాంత్ కోసం ఇంటిదాకా వెళ్లే అవసరం పడలేదు. ఇక్కడే దొరికాడు. దాడిచేస్తానని ఎదురు చూడలేదు పాపం! ఈనాటి సమాజంలో అక్రమ సంబంధాలు ఎలా సాగుతున్నాయో, ఎలా పరిణమిస్తున్నాయో భావితరాల వాళ్లకు తెలియచెప్పడం నా బాధ్యత కదా!" అన్నారు.

నేను తలవంచుకున్నాను. "సారీ!" అన్నాను.

"సారీ చెప్పనవసరం లేదు. నేనే నీకు థాంక్స్ చెప్పాలి. కాప్స్యూల్‌లో మగ స్పెసిమన్ మాత్రమే ఉంటే ఎలా? ఆడ స్పెసిమన్‌గా నువ్వు ఉపయోగపడుతున్నందుకు నేనే నీకు కృతజ్ఞుణ్ణి. ఈ కాప్స్యూల్‌లో - సజీవ సమాధిలో ఉండు! ఎప్పుడు నీ ప్రాణం పోయిందో రాసి పెట్టి ఉంచు. పై తరాలవారికి పనికొస్తుంది!" అంటూ ఆయన నాకేదో వాసన చూపించారు.

నాకు స్పృహ తప్పింది.

■

